చదువు

ఐఐటీల తర్వాత అంతర్జాతీయ స్థాయి విద్యకు మనదేశంలో పేరెన్నికగన్న సంస్థలు ఐఐఎంలు. ఐఐఎంలలో మేనేజ్‌మెంట్ కోర్సు చదివిన విద్యార్థుల ప్లేస్‌మెంట్ వార్తలు ఏటా పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కుతుంటాయి. లక్షల్లో వేతనాలు ఇస్తామంటూ పెద్ద పెద్ద కంపెనీలు ఐఐఎం విద్యార్థుల కోసం వరుస కట్టడమే దీనికి కారణం. ఇంత పేరున్న ఐఐఎంలలో ప్రవేశానికి అవకాశం కల్పించే పరీక్ష 'క్యాట్'. ఈ పరీక్ష ఎలా ఉంటుంది? సాధారణ విద్యార్థులు ఐఐఎంలలో సీటు కోసం పోటీపడవచ్చా?

కొడితేనే క్యాట్



ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులు మాత్రమే క్యాట్ బాగా రాయగలరనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. ఇది అపోహ మాత్రమే.

పట్టుదల, ఏకాగ్రతతో చదివితే సాధారణ విద్యార్థులకైనా క్యాట్‌లో మంచి స్కోరు సాధించడం కష్టమేమీ కాదు.

మేనేజ్‌మెంట్ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. పెద్ద కంపెనీల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాలు, మంచి వేతనాలు, కెరియర్‌లో ఎదగడానికి మరిన్ని అవకాశాలు అందుబాటులో ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం మనదేశంలో ఎంబీఏ/ మేనేజ్‌మెంట్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ అందించే సంస్థలు వేయికిపైనే ఉన్నాయి. వీటన్నిటిలోకి అగ్రగామి సంస్థలు ఐఐఎంలు (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్). ఐఐటీల మాదిరిగానే పటిష్టమైన ఎంపిక ప్రక్రియ ఆధారంగా ఐఐఎంలలో సీట్లను భర్తీ చేస్తారు.

ఈ స్కోరు ఒక్కటే చాలదు!

క్యాట్ పరీక్షను అన్ని ఐఐఎంలు కలిసి నిర్వహిస్తాయి. కేవలం క్యాట్‌లో స్కోరు ఆధారంగానే సీట్లను ఐఐఎంలలో కేటాయించరు. ఒక్కో సంస్థకు ఒక్కో విధమైన ఎంపిక ప్రక్రియ ఉంటుంది. గ్రూప్ డిస్కషన్‌లు, ఇంటర్వ్యూలు, అభ్యర్థి పని అనుభవం... ఇవన్నీ ఎంపిక ప్రక్రియలో కీలకమైన దశలు. ఆయా సంస్థల వెబ్‌సైట్లలో ప్రత్యేక అర్హతలు, ఎంపిక ప్రక్రియ వివరాలు లభిస్తాయి.

క్యాట్ పరీక్షకు హాజరయ్యేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. గత ఏడాది రెండులక్షల మందికిపైనే క్యాట్ రాశారు. నాన్ సీరియస్ అభ్యర్థులను పోటీ నుంచి తొలగించడానికి ఐఐఎంలు ప్రయత్నిస్తున్నాయి. దీనిలో భాగంగానే రెండేళ్ల కిందట డిగ్రీ అర్హత మార్కులను 50 శాతానికి పెంచారు. రెండంచెల పరీక్ష విధానం కూడా ఐఐఎంల పరిశీలనలో ఉంది. ఇది అమల్లోకి రావడానికి మరికొంత సమయం పట్టవచ్చు. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు కేటాయించే సమయాన్ని కూడా తగ్గించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

ప్రశ్నపత్రం అనూహ్యం!

క్యాట్ ప్రశ్నపత్రం స్వభావాన్ని ఊహించడం కష్టం. ఏవైనా పెద్ద మార్పులు ఉంటే తప్ప ప్రశ్నపత్రం రూపురేఖలను ఐఐఎంలు వెల్లడించవు. ఏ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయో కొంతమేరకు తెలుసుకోవచ్చు. సాధారణంగా డేటా ఇంటర్‌ప్రెటేషన్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఎనలిటికల్ అండ్ లాజికల్ రీజనింగ్, రీడింగ్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి ప్రశ్నలడుగుతారు. అయితే అప్రకటిత మార్పులు, ప్రశ్నలను ఎదుర్కోవడానికి కూడా విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉండాలి.

నాలుగేళ్ల నుంచి క్యాట్‌లో బాగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మొదట్లో ప్రశ్నల సంఖ్య 180- 200 మధ్య ఉండేది. ఐదేళ్ల కిందటి వరకు దాదాపు 150 ప్రశ్నలడిగేవారు. ప్రస్తుతం ప్రశ్నల సంఖ్య 90కి తగ్గింది. విభాగాలవారీగా చూస్తే వెర్బల్ ఎబిలిటీకి ప్రాధాన్యం కొంచెం పెరుగుతోంది. కానీ ఈ మార్పుల ఆధారంగా క్యాట్ ప్రశ్నపత్రాన్ని ఊహించడం మంచిది కాదు. ప్రశ్నల సంఖ్య, ప్రాధాన్యం విషయంలో ఈ పరీక్షకు ఎలాంటి నిబంధనలు లేవు. ప్రశ్నల స్వభావంలో కూడా క్రమేణా మార్పులు వస్తున్నాయి. విద్యార్థి తెలివితేటలకంటే అవగాహనను ఎక్కువగా పరీక్షించే విధంగా ప్రశ్నలుంటున్నాయి.

కటాఫ్ గురించి...

క్యాట్ పరీక్షలో విభాగాలవారీగా కటాఫ్ మార్కులు ఉంటాయి. వీటి ఆధారంగా ఐఐఎంలు తర్వాత దశలకు విద్యార్థులను అనుమతిస్తాయి. అన్ని విభాగాల్లోనూ సామర్థ్యం చూపితేనే తర్వాత దశకు ఎంపికయ్యే అవకాశాలుంటాయి. ప్రతి విభాగంలోనూ కనీసం 25 శాతం మార్కులకు తక్కువ కాకుండా, అన్ని పేపర్లలో కలిపి సగటున కనీసం 33 శాతం మార్కులు సాధిస్తే గ్రూప్ డిస్కషన్‌కు పిలుపు లభించవచ్చు.

ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులు మాత్రమే క్యాట్ బాగా రాయగలరనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. ఇది అపోహ మాత్రమే. ఇంజినీరింగ్ నేపథ్యంలేని విద్యార్థులు ఏటా చాలామంది ఐఐఎంలకు ఎంపిక పుతుంటారు. రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగానే ఎంపిక ఉంటుంది. కొన్ని సంస్థలు అభ్యర్థులకు పనిలో అనుభవం ఉంటే ప్రాధాన్యం ఇస్తాయి. క్యాట్ రాయాలనుకుంటే ముందుగానే దీర్ఘకాలిక ప్రణాళిక వేసుకుని దానికను గుణంగా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి.

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ప్రధానంగా గుర్తుంచుకోవాల్సిన అంశం ఏమిటంటే... ఒక అభ్యర్థి ఎన్ని మార్కులు సాధించాడనేదానికంటే ఇతరులకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాడా లేదా అనేదే ముఖ్యం. క్యాట్‌కు కూడా ఇది వర్తిస్తుంది. ప్రశ్నపత్రం స్వభావం, అనుకోకుండా వచ్చే ప్రశ్నలు అందరికీ వర్తిస్తాయి. అందువల్ల వాటి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విభాగాలవారీగా మీ సామర్థ్యాలను అంచనా వేసుకుని, ఉన్న సమయంలో దేనికి ఎంత కేటాయించాలో నిర్ణయించుకోవాలి. క్యాట్‌లో నెగటివ్ మార్కులు కూడా ఉంటాయి. సమాధానాలు రాసినవాటిలో కనీసం 85 శాతం సరైనవైతేనే సీటు తెచ్చే స్కోరు సాధించే అవకాశం ఉంటుంది. ప్రశ్నల స్వభావాన్ని బట్టి చూస్తే అన్నిటికీ సమాధానాలు గుర్తించడం కష్టమే. అందువల్ల ప్రశ్నల ఎంపిక కూడా కీలకమే. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధమైతే క్యాట్‌లో మంచి స్కోరు సాధించగలరు.

సామర్థ్యాలకు పదును పెడితేనే...

అభ్యర్థుల మేనేజ్‌మెంట్ సామర్థ్యాలను అంచనా వేయడంలో క్యాట్ పరీక్షకు చాలా మంచి పేరుంది. జాతీయ స్థాయి పరీక్ష కాబట్టి అభ్యర్థులు పూర్తిస్థాయిలో తమ శక్తి సామర్థ్యాలకు పదును పెడితేనే ఈ పరీక్షలో నెగ్గగలరు. క్యాట్ పరీక్ష బాగా కఠినంగా ఉంటుందనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ పట్టుదల, ఏకాగ్రతతో చదివితే సాధారణ విద్యార్థులకైనా క్యాట్‌లో మంచి స్కోరు సాధించడం కష్టమేమీ కాదు. విద్యార్థులు పూర్తిగా కోచింగ్ సంస్థల మీద ఆధారపడటం కంటే కొంతమంది గ్రూప్‌గా ఏర్పడి ప్రిపరేషన్ కొనసాగిస్తే మంచి ఫలితం ఉంటుంది.

జి.ఆర్.రెడ్డి
ఎం.డి., Husys

మనరాష్ట్రంలో ఎంసెట్, ఐఐటీ-జేఈఈ లాంటి పరీక్షలకు ఉన్నంత ఆదరణ క్యాట్‌కు లేదు. విద్యార్థులకంటే తల్లిదండ్రుల పాత్రే ఇందులో ఎక్కువగా కనిపిస్తోంది. గ్రాడ్యుయేషన్ స్థాయిలోనూ మేనేజ్‌మెంట్ కోర్సు పట్ల విద్యార్థులకు సరైన అవగాహన ఉండటం లేదు. విద్యార్థులకు అధ్యాపకుల నుంచి సరైన మార్గనిర్దేశం లభించడం లేదు. బీటెక్ తర్వాత ఎంటెక్, బీఎస్సీ తర్వాత ఎమ్మెస్సీ... ఇలా కొనసాగుతోంది విద్యార్థుల ఆలోచన ధోరణి. అందుకే మనరాష్ట్రంలో సాంకేతిక, వృత్తి విద్య కోర్సులవైపు వెళ్లినంతగా మేనేజ్‌మెంట్ కోర్సులవైపు విద్యార్థులు రావడం లేదు.

అనుభవం తర్వాత...

అనేక బహుళజాతి కంపెనీలు దేశంలో అడుగుపెడుతున్నాయి. వీటన్నిటికీ సరైన మేనేజ్‌మెంట్ నిపుణుల అవసరం చాలా ఉంటుంది. అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు మేనేజ్‌మెంట్ అభ్యర్థులకు అందుబాటులోకి వస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే టెక్నాలజీ రంగంలో అనుభవం ఉన్నవారు కూడా ప్రస్తుతం మేనేజ్‌మెంట్ వైపు వస్తున్నారు. అందువల్ల మేనేజ్‌మెంట్ కోర్సుల వైపు వెళ్లేవారి సంఖ్య క్రమంగా అధికమవుతోంది. భవిష్యత్తులో ఈ ధోరణి మరింత పెరిగే అవకాశం ఉంది.

క్యాట్ పరీక్ష రాయాలనుకుంటే గ్రాడ్యుయేషన్ తర్వాత కనీసం రెండేళ్లు పనిలో అనుభవం సాధిస్తే మంచిది. ఇలా చేయాలంటే విద్యార్థులకు తల్లిదండ్రుల నుంచి చాలా ప్రోత్సాహం కావాలి. పని చేస్తూ కొంతమంది అభ్యర్థులు కలిసి క్యాట్‌కు సిద్ధమవడం మంచి పద్ధతి. ఇంటర్నెట్ ద్వారా కూడా నెట్‌వర్క్ ఏర్పరచుకుని సమష్టిగా కృషి చేస్తే క్యాట్ సాధించడం తేలిక.

పెద్ద కంపెనీల్లో ప్రవేశానికి...

పెద్ద కంపెనీల్లో, మంచి ఉద్యోగాల్లో ప్రవేశానికి అనుమతించే టికెట్ లాంటి పరీక్ష క్యాట్. అంతర్జాతీయ స్థాయి విద్య, వ్యాపార వ్యవహారాలను అవగాహన చేసుకోవాలంటే క్యాట్ రాయడం, ఐఐఎంలు లేదా పేరున్న బిజినెస్ స్కూళ్లలో చదవడం తప్పనిసరి.

సాధారణ విద్యార్థులు క్యాట్ సాధించాలంటే దీర్ఘకాలం శ్రమించాల్సిందే. కనీసం ఏడాదిపాటు రోజుకు నాలుగైదు గంటలు ప్రత్యేక శ్రద్ధతో సిద్ధమైతేనే క్యాట్‌లో మంచి స్కోరు ఆశించవచ్చు. మ్యాథమేటికల్/ లాజికల్ ఆప్టిట్యూడ్, లాంగ్వేజ్ అంశాలకు ప్రిపరేషన్‌లో అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. మంచి పేరున్న శిక్షణ సంస్థల సహాయం తీసుకోవచ్చు. సాంకేతిక అంశాల అవగాహనకు శిక్షణ కొంతవరకు ఉపయోగపడుతుంది.

పట్టుదల, సాధారణ స్థాయి కంటే కొంచెం ఎక్కువ ఐ.క్యూ. ఉంటే మామూలు విద్యార్థులు కూడా క్యాట్ సాధించగలరు. కటాఫ్ మార్కులు ఒక్కో సంస్థకు ఒక్కో విధంగా ఉంటాయి. అహ్మదాబాద్, బెంగళూరు, కలకత్తా ఐఐఎంలకు సాధారణంగా కటాఫ్ బాగా ఎక్కువగా ఉంటుంది. క్యాట్ స్కోరును పరిగణనలోకి తీసుకునే ఇతర బిజినెస్ స్కూళ్లకు ఐఐఎంల కంటే తక్కువ కటాఫ్ సరిపోతుంది. దక్షిణ భారతదేశం నుంచి ఐఐఎంలకు ఎంపికయ్యే వారి శాతం క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా తమిళనాడు నుంచి బాగా ఎంపికవుతున్నారు.

- ప్రదీప్ కుమార్ చౌధురి,
చీఫ్ మేనేజర్, హెచ్.ఆర్., ఎక్సైడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్

దరఖాస్తులు ఎలా?

- క్యాట్ పరీక్ష రాయడానికి డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు అవసరం. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులుంటే చాలు.
- దరఖాస్తులతో కూడిన క్యాట్ బులెటిన్‌లను ఐఐఎంలు ఎంపిక చేసిన యాక్సిస్ బ్యాంకు బ్రాంచిల నుంచి పొందవచ్చు.
- మనరాష్ట్రంలో దరఖాస్తులు లభించే యాక్సిస్ బ్యాంకు శాఖలు: హైదరాబాద్ (బేగంపేట రోడ్, కూకట్‌పల్లి), సికింద్రాబాద్ (రాష్ట్రపతి హౌస్, తార్నాక), చిత్తూరు (ప్రకాశం హై రోడ్), కాకినాడ (సుభాష్ రోడ్), కర్నూలు (రైల్వేస్టేషన్ రోడ్), విజయవాడ (రాజగోపాలచారి వీధి), విశాఖపట్నం (ద్వారకానగర్), వరంగల్ (స్టేషన్ రోడ్).

ఐఐఎంల వెబ్‌సైట్లు

- ఐఐఎం, అహ్మదాబాద్: www.iimahd.ernet.in
- ఐఐఎం, బెంగళూరు: www.iimb.ernet.in
- ఐఐఎం, కలకత్తా: www.iimcal.ac.in
- ఐఐఎం, ఇండోర్: www.iimidr.ac.in
- ఐఐఎం, కొజికోడ్: www.iimk.ac.in
- ఐఐఎం, లక్నో: www.iiml.ac.in
- ఆర్‌జీఐఐఎం, షిల్లాంగ్: www.rgiim.ac.in

ముఖ్యమైన తేదీలు

- యాక్సిస్ బ్యాంకు ద్వారా దరఖాస్తుల అమ్మకం ప్రారంభం-**జులై 14**
- యాక్సిస్ బ్యాంకు ద్వారా దరఖాస్తులు లభించే చివరితేదీ -**ఆగస్టు 8**
- ఐఐఎంల నుంచి క్యాట్ బులెటిన్‌లు పొందడానికి చివరితేదీ - **ఆగస్టు 13**
- ఐఐఎంలలో దరఖాస్తుల స్వీకరణకు చివరితేదీ- **సెప్టెంబరు 5**
- కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)- **నవంబరు 16**

మరికొన్ని సంస్థలకూ క్యాట్

క్యాట్ ద్వారా ఐఐఎంలలో ప్రవేశం పొందలేకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దేశవ్యాప్తంగా 80కిపైగా బిజినెస్ స్కూళ్లు క్యాట్ స్కోరు ఆధారంగా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి. కొన్ని సెంట్రల్ యూనివర్సిటీలు కూడా క్యాట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నాయి. వాటితోపాటు పేరున్న సంస్థలు కొన్ని...

- అమృత స్కూల్ ఆఫ్ బిజినెస్, అమృత విశ్వ విద్యాపీఠం, కోయంబత్తూరు *(www.amrita.edu.asb)*
- భారతీదాసన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, తిరుచిరాపల్లి *(www.bim.edu)*
- బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, గ్రేటర్ నోయిడా *(www.bimtech.ac.in)*
- యూనివర్సిటీ ఆఫ్ లక్నో, లక్నో *(www.lkouniv.ac.in)*
- యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా, కోల్‌కతా *(www.caluniv.ac.in)*
- ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్, ధన్‌బాద్ *(www.ismdhanbad.ac.in)*
- ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, న్యూఢిల్లీ *(www.fsm.ac.in)*
- బెనారస్ హిందూ యూనివర్సిటీ, వారణాసి *(www.bhu.ac.in)*
- ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్, రాజస్థాన్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, బికనీర్ *(www.iabmbikaner.org)*
- ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, ఘజియాబాద్ *(www.imt.edu)*
- ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్ *(www.ipeindia.org)*
- ఐటీఎం బిజినెస్ స్కూల్, నేవీ ముంబాయి *(www.itm.edu)*
- కె.జె. సోమైయా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అండ్ రిసెర్చ్, విద్యావిహార్, ముంబాయి *(http://simsr.somaiya.edu)*
- మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, గుర్‌గావ్ *(www.mdi.ac.in)*
- ముద్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, అహ్మదాబాద్ *(mica-india.net)*
- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్, పుణె *(www.nibmindia.org)*
- ఎన్.పి.జైన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్, ముంబాయి *(www.spjimr.org)*
- స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్ *(www.uohyd.ernet.in)*
- స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, పాండిచ్చేరి యూనివర్సిటీ, పాండిచ్చేరి *(www.pondiuni.org)*
- టి.ఎ. పాయ్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్, మణిపాల్ *(www.tapmi.org)*
- యూనివర్సిటీ బిజినెస్ స్కూల్, పంజాబ్ యూనివర్సిటీ, చండీగఢ్ *(www.ubschandigarh.org)*
- వి.ఐ.టి. బిజినెస్ స్కూల్, వెలూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వెలూర్ *(www.vit.ac.in)*
- వెలింగ్‌కార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ అండ్ రిసెర్చ్, ముంబాయి *(www.welingkar.org)*